cinema NEWS

# బాక్సాఫీస్ చరిత్రలో కొత్త పేజీ - పుష్ప 2 నెంబర్ వన్



అసలు సాధ్యమే కాదని భావించింది నిజమయ్యింది. రాజమౌళి రికార్డులు మళ్ళీ ఆయనే తప్ప ఇంకెవరు బ్రేక్ చేయలేరనే వాదన బద్దలయ్యింది. సంవత్సరాల తరబడి నాన్ బాహుబలి పదానికి అలవాటు పడిన ట్రేడ్ కి కొత్త నిర్వచనం దక్కింది.

పుష్ప 2 ది రూల్ అందరి అంచనాలు తలకిందులు చేస్తూ ఇండియన్ బాక్సాఫీస్ హిస్టరీలోనే అత్యధిక వసూళ్లు సాధించిన నెంబర్ వన్ మూవీగా సరికొత్త చరిత్ర సృష్టించింది. అది కూడా కేవలం 32 రోజుల వ్యవధిలో కావడం అనూహ్యం. మైత్రి మూవీ మేకర్స్ అధికారికంగా ప్రకటించిన దాని ప్రకారం పుష్ప 2 వరల్డ్ వైడ్ సాధించిన గ్రాస్ అక్షరాలా 1831 కోట్ల రూపాయలు.

ఇది ఎప్పుడూ చూడని చరిత్ర. కమర్షియల్ అంశాలున్న ఒక మాస్ మూవీ ఎలాంటి గ్రాఫిక్ కంటెంట్ మీద ఆధారపడకుండా ఇలాంటి ఫీట్ సాధించడం అనూహ్యం. బాలీవుడ్ లో తలలు పండిన అమితాబ్, షారుఖ్, సల్మాన్, అమీర్ లాంటి దిగ్గజాల వల్ల సాధ్యం కానీ ఫీట్ పట్టుమని పాతిక సినిమాలు లేని అల్లు అర్జున్ సాధించడం తెలుగు సినిమా స్థాయి ఎక్కడికి చేరుకుందో చెప్పేందుకు చక్కని ఉదాహరణ.

ఇటీవలే ఒక రౌండ్ టేబుల్ ఇంటర్వ్యూలో నాగవంశీ అన్నట్టు నిజంగానే ఉత్తరాది నిర్మాతలకు మన టాలీవుడ్ సత్తా చూసి నిద్రలేని రాత్రుళ్ళు భవిష్యత్తులో ఎన్నో ఎన్నెన్నో రాబోతున్నాయి.

నెల రోజులు పూర్తి చేసుకున్న పుష్ప 2 ఇంకా ఫైనల్ రన్ ముగించలేదు. నిన్న ఆదివారం కూడా బుక్ మై షోలో 90 వేలకు పైగా అడ్వాన్స్ బుకింగ్ టికెట్లు అమ్మిన సినిమా ఇదొక్కటే. మార్కో, మ్యాక్స్ లాంటి పాజిటివ్ టాక్ వచ్చినవి రెండో వారంలో కనీసం ఇందులో సగం కూడా సాధించలేకపోయాయి.

దీన్ని బట్టే పుష్పరాజ్ మాస్ లో ఎంతగా చొచ్చుకుపోయాడో అర్థం చేసుకోవచ్చు. సంక్రాంతి సందడి జనవరి 10 నుంచి ప్రారంభం కాబోతున్న నేపథ్యంలో మన సౌత్ లో పుష్ప 2 జోరు దాదాపుగా తగ్గినట్టే. కానీ సరైన బాలీవుడ్ మూవీ లేని కారణంగా నార్త్ లో మాత్రం బన్నీ హవా 50 రోజుల దాకా థియేటర్లలో కొనసాగేలా ఉంది.

# ట్రైలరుతోనే ట్రోల్ అయిపోయిన రవికుమార్



కమర్షియల్ సినిమాలు ఎంతో కొంత రొటీన్ ఫ్లేవర్ కలిగి ఉంటాయి. ఇది సహజం. పైకి కొత్తగా ట్రై చేశామని చెప్పినా మాస్ కోసమని పాత ఫార్ములాను వాడి హిట్లు కొట్టే దర్శకులు ఎందరో. అది జనానికి నచ్చేలా ఉంటుందో లేదో ట్రైలర్ రూపంలో శాంపిల్ వదులుతారు.

కానీ బాలీవుడ్ నుంచి వచ్చే నెల రాబోతున్న బ్యాడ్ ఆస్ రవికుమార్ అనే కళాఖండం మాత్రం వెరైటీ స్ట్రాటజీని అనుసరిస్తోంది. 80 దశకం నాటి కథా కథనాలతో ఈ సినిమా తీశామని ఓపెన్ గా చెబుతూ దాన్నే ప్రమోషన్లలో వాడుకుంటున్నారు. ఒకప్పటి టాప్ సింగర్ హిమేష్ రేషమియా ఇందులో హీరోగా నటించడంతో పాటు సంగీతం అందించారు.

ట్రైలర్ లోనే బోలెడు ట్రోలింగ్ స్టఫ్ కనిపిస్తోంది. రంపపు మెషీన్ పట్టుకుని ఎదురొచ్చిన రౌడీ శరీరాన్ని ముక్కలు చేయడం దగ్గరి నుంచి నమ్మకశ్యం కానీ ఎన్నో షాట్లు, జంపులు, ఛేజులు ఇందులో పొందుపరిచారు. విచిత్రం ఏంటంటే ఖరీదైన లొకేషన్లు, విదేశాల్లో పాటలు ఫైట్లు ఇలా భారీతనం ఏ మాత్రం తగ్గకుండా గ్రాండియర్ గా తీశారు. మరో ట్విస్టు ఏంటంటే మన ప్రభుదేవా ఇందులో విలన్. పదే పదే 80 స్టైల్ అని క్యాప్షన్లు పెట్టి మరీ పబ్లిసిటీ చేస్తున్న ఈ బ్యాడ్ ఆస్ రవికుమార్ కు ఒక్క రోజులోనే 30 మిలియన్ల వ్యూస్ రావడం గమనార్హం. సోషల్ మీడియాలో నెటిజెన్లు దీన్ని ట్రోల్ చేస్తూనే మరోవైపు ఎంజాయ్ చేస్తున్నారు. అసలు కంటెంట్ ఎలా ఉందనేది పక్కనపెడితే హిమేష్ ఫ్యాన్స్ కొందరు విక్రమ్, మార్కో, ఖైదీ, యానిమల్ తో దీన్ని పోలుస్తూ పోస్టులు పెట్టడం మాములు కామెడీ కాదు. అసలు పేపర్ మీదే ఇంత రొటీనా అనిపించే కథని ఇన్నేసి కోట్లను కుమ్మరించిన నిర్మాతల ధైర్యాన్నిమెచ్చుకోవలసిందే. ఏదైనా పన్ను మినహాయింపు కోసం తీశారేమోననే అనుమానాలు లేకపోలేదు. హిందీ విశ్లేషకులు, రివ్యూయర్లు మాత్రం హిమేష్ ప్రయత్నం ఎలా ఉన్నా బిసి సెంటర్లలో వసూళ్లు ఖాయంగా వస్తాయని చెబుతున్నారు. పుష్ప 2 లాంటి ఆర్గానిక్ మాస్ చూసిన కళ్ళు బ్యాడ్ ఆస్ రవికుమార్ ని ఒప్పుకుంటాయా.

# గేమ్ ఛేంజర్ టికెట్ రేట్లపై సస్పెన్స్!



తెలంగాణలో ఇకపై టికెట్ల రేట్ల పెంపు, స్పెషల్, బెనిఫిట్ షోలు ఉండవని సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో తేల్చి చెప్పిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత టాలీవుడ్ సినీ ప్రముఖులతో భేటీ అయిన సందర్భంగా కూడా ఈ ప్రస్తావన వారి మధ్య వచ్చినట్లు ప్రచారం జరిగింది. అయితే, ఆ ఒక్క విషయంలో మాత్రం రేవంత్ వెనక్కు తగ్గలేదని ప్రచారం జరిగింది.

అయితే, టికెట్ రేట్ల పెంపు అంశంపై చర్చించలేదని టీఎఫ్ డీసీ ఛైర్మన్, నిర్మాత దిల్ రాజు ఆనాడు అన్నారు. ఈ క్రమంలోనే తాజాగా టికెట్ రేట్ల పెంపుపై దిల్ రాజు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అడగనిదే అమ్మైనా పెట్టదని, తెలంగాణలో గేమ్ ఛేంజర్ టికెట్ రేట్ల పెంపు కోసం సీఎం రేవంత్ రెడ్డిని కలుస్తానని దిల్ రాజు చెప్పారు.

జనవరి 10న ఈ చిత్రం రిలీజ్ కాబోతున్న నేపథ్యంలో ఏపీలో టికెట్ రేట్లు పెంచుకునేందుకు ఏపీ ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ లకు దిల్ రాజు ధన్యవాదాలు కూడా తెలిపారు. ఈ క్రమంలోనే గేమ్ చేంజర్ టికెట్ రేట్లు పెంచుకునేందుకు పర్మిషన్ ఇవ్వాలని రేవంత్ రెడ్డిని మరోసారి రిక్వెస్ట్ చేస్తానని దిల్ రాజు చెప్పారు.

టికెట్ రేట్లు పెంచితే 18 పర్సెంట్ గవర్నమెంట్ కు వెళుతుందని, భారీ బడ్జెట్ సినిమాలకు ప్రభుత్వాల సహాయం అవసరమని చెప్పారు. భారీ స్థాయిలో రూపొందుతున్నందునే తెలుగు సినిమాకు ప్రపంచ ఖ్యాతి దక్కిందని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి సినీ ఇండస్ట్రీకి అన్నీ ఇస్తానని చాలాసార్లు చెప్పారని, ఆ ఆశతో మళ్లీ సీఎం రేవంత్ రెడ్డిని కలిసి టికెట్ రేట్లు, స్పెషల్ షోల గురించి మాట్లాడతానని అన్నారు. దిల్ రాజు రిక్వెస్ట్ ను రేవంత్ రెడ్డి అంగీకరిస్తారా లేదా అన్నది తేలాల్సి ఉంది.

## సీఎం కావాలనుంది.. త్రిష సంచలన స్టేట్మెంట్



హీరోయిన్లు రాజకీయాల్లోకి రావాలనే ఆకాంక్షను వెల్లడించడం.. అందుకు అనుగుణంగానే సినిమాల్లో కెరీర్ ముగుస్తున్న దశలో ఆ రంగంలోకి అడుగు పెట్టడం కొత్తేమీ కాదు. ఈ కోవలో ఎంతోమందిని చూశాం. కానీ సినీ రంగం నుంచి రాజకీయాల్లోకి అడుగు పెట్టి అత్యున్నత స్థాయికి చేరుకున్న వ్యక్తిగా జయలలిత పేరే చెప్పుకోవాలి. ఐతే ఆమె నేరుగా సీఎం అయిపోవాలన్న లక్ష్యంతో ఏమీ రాజకీయాల్లోకి రాలేదు. ఎంజీఆర్ అనుయాయురాలిగా తీవ్ర ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొన్న క్రమంలో పట్టుబట్టి రాజకీయాల్లోకి వచ్చారు. మొండి పట్టుదలతో పోరాడి అత్యున్నత పదవిని స్వీకరించారు. ఆమెకు ముందు, తర్వాత సీఎం పదవి గురించి ఏ కథానాయిక కల కూడా కని ఉండదు. ఐతే ఇప్పుడు తమిళ స్టార్ హీరోయిన్ త్రిష తనకీ లక్ష్యం ఉన్నట్లు వెల్లడించి అందరినీ షాక్కు గురి చేసింది. ఎప్పటికైనా తమిళనాడు సీఎం కావాలన్నది తన కోరిక అని ఆమె ఆశ్చర్యకర ప్రకటన చేసింది. ప్రజాసేవతో పాటు సామాజిక మార్పులు రాజకీయాల వల్లే సాధ్యమని అభిప్రాయపడింది. త్రిష వ్యాఖ్యలు తమిళ రాజకీయ, సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. త్రిష 20 ఏళ్ల కెరీర్‌ను పూర్తి చేసుకుంది ఇటీవలే. ఆమె చాలా ఏళ్ల కిందటే సినిమాలు వదిలేసి వ్యక్తిగత జీవితంలో స్థిరపడాలని అనుకుంది. కానీ వరుణ్ మణియన్‌తో ఎంగేజ్మెంట్ రద్దవడం.. మళ్లీ కెరీర్ పుంజుకోవడంతో సినిమాల్లో కొనసాగింది. ఇప్పుడు వయసు 40 పైబడ్డా వరుస సినిమాలతో దూసుకెళ్తోంది. కానీ ఇప్పటిదాకా ఎన్నడూ త్రిష రాజకీయాల గురించి పెద్దగా మాట్లాడింది లేదు. తాను ఆ రంగంలోకి వస్తాననే సంకేతాలు కూడా ఇవ్వలేదు. కానీ ఇప్పుడు సడెన్‌గా ఒకేసారి ముఖ్యమంత్రి పదవి లక్ష్యమని పేర్కొని అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. తమిళనాట రాజకీయాలు, సినిమాలకు విడదీయరాని సంబంధం ఉన్న విషయం తెలిసిందే. అగ్ర హీరో విజయ్ పూర్తి స్థాయి రాజకీయాల్లోకి అడుగు పెట్టబోతున్న వేళ.. అతడి సన్నిహితురాలైన త్రిష ఇలాంటి ప్రకటన చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# అభిమానుల మృతి.. చరణ్ తో పాటు పవన్ ఆర్థిక సాయం



గేమ్ ఛేంజర్ ఈవెంట్ కు వెళ్లి వస్తున్న క్రమంలో హీరో రామ్ చరణ్ అభిమానులు ఇద్దరు రోడ్డు ప్రమాదానికి గురై మరణించిన సంగతి తెలిసిందే. అయితే, కాకినాడ - రాజమహేంద్రవరం మధ్య ఉన్న ఏడీబీ రోడ్డులో ఈ ప్రమాదం జరిగింది. ఆ రోడ్డులో అనేక గుంతలున్నాయని, ఐదేళ్లలో గత ప్రభుత్వం ఆ రోడ్డు మరమ్మతులను పట్టించుకోలేదని ఆరోపణలున్నాయి.

ఈ క్రమంలోనే ఆ ప్రమాద ఘటనపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించారు. మృతుల కుటుంబాలకు పవన్ కల్యాణ్ ఆర్థిక సాయం ప్రకటించారు. జనసేన పార్టీ తరపున మృతుల కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని తెలిపారు. అంతేకాకుండా, ఏపీ ప్రభుత్వం నుంచి తగిన సాయం అందించాలని డిప్యూటీ సీఎం కార్యాలయ అధికారులకు స్పష్టం చేశానని అన్నారు.

ఇప్పటికే నిర్మాత దిల్ రాజు, హీరో రామ్ చరణ్ కూడా అభిమానులకు 10 లక్షలు చొప్పున సహాయం ప్రకటించి, వారికి సంతాపం వ్యక్తం చేశారు. వారి కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని ప్రకటించారు.

ఇకపై, పిఠాపురం నియోజక వర్గ పర్యటనలకు ఏడీబీ రోడ్డు మీదుగా ప్రయాణిస్తానని తెలిపారు. జగన్ హయాంలో ఈ రోడ్డు గురించి పట్టించుకోలేదని, ఆ రోడ్డుపై ప్రయాణించిన ఇద్దరు యువకులు మణికంఠ, శ్రీ చరణ్ దుర్మరణం పాలు కావడంతో ఆవేదనకు లోనయ్యానని పవన్ అన్నారు.గత ప్రభుత్వం కనీసం ఆ రోడ్డుపై గుంతలు పూడ్చలేదని, లైట్లు వేయలేదని, అందుకే ప్రమాదాలు పెరిగాయిని విమర్శించారు.

కూటమి ప్రభుత్వం ఏడీబీ రోడ్డు పనులు చేపట్టిందని, త్వరలోనే పూర్తి చేస్తుందని అన్నారు. ఇళ్లకు సురక్షితంగా వెళ్ళాలని గేమ్ ఛేంజర్ ఈవెంట్ ప్రసంగంలో ఒకటికి రెండుసార్లు చెప్పానని గుర్తు చేసుకున్నారు. కాగా, మణికంఠ, చరణ్ ల కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల చొప్పున ఆర్ధఇక సాయం ప్రకటించారు నిర్మాత దిల్ రాజు.

# చైనాలో బాహుబలి రికార్డు బ్రేక్ చేసిన మహారాజ!



విజయ్ సేతుపతి మహారాజ గత ఏడాది ఎంత పెద్ద సంచలన విజయం సాధించిందో తెలిసిందే. తెలుగులో అంచనాలు లేకుండా రిలీజై ఇక్కడా సూపర్ హిట్ అందుకుంది. సరే ఇండియాలో హిట్ కావడం పెద్ద విశేషం కాదు కానీ అసలు మన భాషలే తెలియని చైనాలో మహారాజా బ్లాక్ బస్టర్ కావడం మాములు విషయం కాదు.

ఆ దేశంలో ఇప్పటిదాకా టాప్ గ్రాసర్స్ గా ఉన్న సినిమాలన్నీ బాలీవుడ్ నుంచి వచ్చినవే. అమీర్ ఖాన్ దంగల్ 1480 కోట్లతో నెంబర్ వన్ స్థానంలో ఉండగా అదే హీరో సీక్రెట్ సూపర్ స్టార్ 840 కోట్లతో రెండో ప్లేస్ లో ఉంది. మూడో స్థానం అందాదున్ తీసుకుంది. దాని లెక్క 368 కోట్లు.

అక్కడి నుంచి వరసగా భజరంగి భాయ్ జాన్ (323 కోట్లు), హిందీ మీడియం (238 కోట్లు), హిచ్కీ (170 కోట్లు), పీకే (134 కోట్లు), మామ్ (130 కోట్లు), టాయిలెట్ ఏక్ ప్రేమ్ కథ (108 కోట్లు) తో ఉన్నాయి. ఇప్పుడు మహారాజా 92 కోట్లతో పదో ర్యాంక్ లో ఉంది. చైనాలో టాప్ 10 ఇండియన్ సినిమాల్లో దక్షణాదిది మహారాజ ఒక్కటే.

ఇంకా ఫైనల్ రన్ పూర్తవ్వలేదు కాబట్టి 100 కోట్ల రికార్డు బ్రేక్ చేస్తుందేమో చూడాలి. రాజమౌళి బాహుబలి 2 కేవలం 80 కోట్లతో ఉండగా బాహుబలి 50 కోట్లతో సరిపెట్టుకుంది. ఆర్ఆర్ఆర్ 40 కోట్ల దగ్గర రాజీ పడింది. ఈ లెక్కన మహారాజ ప్రభావం ఏ స్థాయిలో చైనా ప్రేక్షకుల మీద ఉందో అర్థం చేసుకోవచ్చు.

స్వంత కూతురు కాకపోయినా ఒక అమ్మాయి అఘాయిత్యానికి బలైతే పెంచుకున్న తండ్రి తీర్చుకునే ప్రతీకారం చైనా జనాలకు ఓ రేంజ్ లో కనెక్ట్ అయిపోయింది. సీరియస్ టోన్ లో సాగుతూ ఎక్కడా కమర్షియల్ అంశాలకు చోటు లేకుండా తీసిన విధానం విమర్శకులను సైతం మెప్పించింది.

చైనాలో టాప్ 10 ఇండియన్ మూవీస్ గమనిస్తే మాస్ మసాలా సినిమా ఏదీ ఉండదు. అన్నీ కంటెంట్ ఆధారంగా తీసినవే ఉంటాయి. విజువల్ ఎఫెక్ట్స్ తో తీసిన మన చిత్రాలను వాళ్లంత సీరియస్ గా తీసుకోరు. భావోద్వేగాలు బలంగా ఉంటే చాలు చైనాలో దుమ్ము దులిపేయొచ్చు. కలెక్షన్లు అదే స్పష్టం చేస్తున్నాయి.

Printed & Published Owned by, B.Srinivas,H No:6-3-439,Kishan Nagar,Karimnagar, Telangana,505001.Printed at Sri Balaji Printing Press.
H No. 4-4-55, Tilak Road, Karimnagar.(TS). RNI No: APTEL/2006/19056, Cell : 63055 84064, Mail: tarajyothi999@gmail.com